www.netifocusnews.com
నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
తెలుగు డిజిటల్ దినపత్రిక
తెలంగాణ జిల్లాలు
శుక్రవారం 17, అక్టోబర్ 2025 పేజీలు 4



# మీడియాపై రాజకీయ కక్షలు సరికాదు

## పత్రికా స్వేచ్ఛపై ఏపీ ప్రభుత్వ దాడిని నిరసిస్తూ జర్నలిస్టులు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన

తొర్రూరు, (నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి/ఓరుగంటి సైదులు)–అక్టోబర్ 16:

**సమాజానికి మూల స్తంభమైన మీడియాపై రాజకీయ కక్షలు** సరికాదని, ప్రభుత్వ వైఫల్యాలు ప్రశ్నించినందుకు ఏపీ ప్రభుత్వ దాడులు హేయమైన చర్య అని ఐజేయు జాతీయ కమిటీ సభ్యుడు దూలం శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, తెలంగాణ ఉద్యమకారుల సంఘం నాయకుడు ముద్దసాని వెంకటేశ్వర్లు అన్నారు. ఏపీలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించినందుకు మీడియాపై దాడులను నిరసిస్తూ జర్నలిస్టులు, ప్రజాసంఘాల నాయకులు గురువారం డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనం ఎదుట జాతీయ రహదారిపై నిరసన తెలిపారు. ప్లకార్డులు చేతబూని చంద్రబాబు ప్రభుత్వ తీరును ఎండగట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించినందుకు సాక్షి పత్రికపై చంద్రబాబు ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దిగడం సరైనది కాదన్నారు. నిజాలు నిర్భయంగా రాసే, మిగతా 2లో..




# కస్తూర్బా గాంధీలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

మహబూబాబాద్, (నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఓరుగంటి సైదులు)–అక్టోబర్ 16:

**గురువారం జిల్లా కలెక్టర్ కురవి మండలం** నేరేడ గ్రామంలోని కేజీబీవీ, మోడల్ స్కూల్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణంలోని కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, టాయిలెట్స్, స్టడీ రూమ్స్, తరగతి గదు లు, స్టోర్ రూమ్, పరిసరాలను పరిశీలించారు. తరగతి గదిలో జరుగుతున్న విద్యా బోధనలను స్వయంగా పిల్లల విద్యా సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. ఏఐ డిజిటల్ తరగతులు, ద్వారా ప్రతీ సబ్జెక్టు మీద పిల్లవిద్యా సామర్థ్యాలను పెంపొందించాలని, అందుకు అనుగుణంగా సంబంధిత టీచర్స్, పిల్లల హాజరు శాతం పెం చాలని సూచించారు. డైట్ మెనూ ప్రకారం రుచి కరమైన, నాణ్యమైన, ఆహారాన్ని అందించాలని, తాజా కూరగాయలు, స్వచ్ఛమైన ఆహార పదార్థా లతోనే బ్రేక్ ఫాస్ట్, మిగతా 2లో..







# మీడియాపై రాజకీయ కక్షలు సరికాదు..

(మొదటి పేజీ తరువాయి)

చూపించే మీడియా సంస్థలపై టెర్ర రైజ్ చేసే ధోరణులను ప్రజాస్వామిక వాదులందరూ ఖండించాలన్నారు. ప్రజా వ్యతిరేక పాలనపై ప్రతిపక్షాలు, సమాచార మాధ్యమాలు గొంతుకను వినిపించే హక్కు లేకుండా చూడటం నియంత పాలనేనని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాక్షి పత్రిక ఎడిటర్ పై వరస కేసులు నమోదు చేయడం ఆక్షేపణీయమన్నారు. పత్రికా స్వేచ్ఛ రాజ్యాంగం కల్పించిన హక్కు అని, హక్కులను కాలరాసేలా చంద్రబాబు ప్రభుత్వం దిగజారుడు కుట్రలు చేస్తుందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే పత్రికలపై దాడులను ప్రజాస్వామికవాదులు, అన్ని వర్గాల ప్రజలు ముక్తకంఠంతో ఖండించాలన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ నాయకులు కొత్తూరు రమేష్, బీసీ సంఘ నాయకులు కొండా వెంకన్న, కొదునూరి సధాకర్, అవారి అంజన్న, అనపురం వెంకన్న, జర్నలిస్టులు మేరుగు రమేష్, జిలుకర రాజు, చీకటి వీరన్న, వేర్పుల మహేష్, చేను రామకృష్ణ, మడిపెద్ది కార్తీక్, ఓరుగంటి సైదులు, సర్వి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# కస్తూర్బా గాంధీలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

(మొదటి పేజీ తరువాయి)

లంచ్, డిన్నర్, సిద్ధం చేయా లని సూచించారు. షెడ్యూల్ ప్రకారం పిల్లల యొక్క హెల్త్ ప్రొఫైల్ ను మెయింటైన్ చేస్తూ వైద్య పరీక్షలు నిర్వహించాలని వారి యొక్క ఆరోగ్య మానసిక సమస్య లపై కౌన్సిలింగ్ ఇవ్వాలని, వసతి గృహంలో వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండే చర్యలు తీసుకోవాలని సూచిం చారు. వసతి గృహాల పరిసరా లు తరగతి గదులు మరుగుదొడ్లు తదితర ప్రదేశాలలో క్రమం తప్పకుండా పక్కాగా సానిటేషన్ నిర్వహించాలని తద్వారా ఎలాంటి అనారోగ్య సమస్యలు రాకుండా ఉంటుందని అన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని సంక్షేమ వసతి గృహాలు, అంగన్వాడి కేంద్రాలు, పాఠశాలల్లో మండల ప్రత్యేక అధికారులు తహసిల్దారులు, ఎంపీడీవోలు, సంబంధిత అధికారులు ఇప్పటికే ప్రత్యేక డ్రైవ్ ద్వారా మూడు రోజులు అన్ని వసతి గృహాలను తనిఖీలు పరిశీలనలు చేశారని, హెల్త్ ఎడ్యుకేషన్, న్యూట్రిషన్, సానిటేషన్, లపై నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కలెక్టర్ వెంట స్థానిక వసతి గృహం స్పెషలాఫీసర్, సంబంధిత సిబ్బంది ఉన్నారు.





# రైతులను ఇబ్బంది పెట్టవద్దు

- ఐకెపి కేంద్ర సిబ్బందికి కడియం హెచ్చరిక

**జనగామ, (నేటి ఫోకస్‌న్యూస్)-అక్టోబర్ 16:** రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చే రైతులను.. కేంద్ర నిర్వాహకులు ఇబ్బంది పెడితే సహించేది లేదని ఎమ్మెల్యే కడియం శ్రీహరి హెచ్చరించారు. ధాన్యం కొనుగోలులో వారికి సహాయంగా ఉండి తగిన విధంగా చేయూత ఇవ్వాలన్నారు. నమిలిగొండలో గురువారం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కడియం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి సమస్య ఉన్నా రైతులు తన దృష్టికి తీసుకురావాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం-రైతు ప్రభుత్వమని దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతుల కోసం సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఈ ఏడాది నుంచి ధాన్యం డబ్బులతో పాటు బోనస్ కూడా అందించడానికి ప్రభుత్వం అద్భుతమైన నిర్ణయం తీసుకుందని కొనియాడారు. ధాన్యం కొనుగోలు ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. రైతులకు మద్దతు ధరలు ఇవ్వడం, పూర్తి ధాన్యం కొనడం ప్రభుత్వ బాధ్యతని అన్నారు.

# సురేఖ ఓఎస్డీ గురించి తెలియదు

- తన కుమార్తె ఏం మాట్లాడిందో కూడా తెలియదు
- కాంగ్రెస్ నేత కొండా మురళి



**హనుమకొండ, అక్టోబర్ 16 (ప్రభాత జాగృతి):** మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్ విషయం తనకేమీ తెలియదని ఆమె భర్త, కాంగ్రెస్ నేత కొండా మురళి అన్నారు. తన కుమార్తె సుస్మిత హైదరాబాద్‌లో ఏం మాట్లాడిందో తెలియదన్నారు. స్మార్ట్ ఫోన్ చూడటం తనకు రాదని చెప్పారు. సిమెంట్ కంపెనీ యాజమాన్యాలను సుమంత్ బెదిరించినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆయన్ను ఓఎస్డీ బాధ్యతల నుంచి ప్రభుత్వం తొలగించిన విషయం తెలిసిందే. ఇదే క్రమంలో బుధవారం రాత్రి హైదరాబాద్‌లో మంత్రి కొండా సురేఖ ఇంటి వద్దకు సుమంత్ కోసం పోలీసులు రావడం.. మంత్రి కుమార్తె సుస్మిత అడ్డుకోవడం తదితర పరిణామాల నేపథ్యంలో హనుమకొండలో కొండా మురళి మీడియాతో మాట్లాడారు. నా కుమార్తె, అల్లుడు లండన్‌లో ఉన్నారు.. అక్కడ వ్యాపారం చేస్తున్నారు. నా బిడ్డకు పదవి ఏమీ లేదు.. ఆమె ఏ పార్టీలోనూ లేదు. మంత్రి ఛాంబర్‌కు ఇప్పటివరకు నేను వెళ్లలేదు. భద్రతా కారణాల వల్ల వేర్వేరు కార్లలో నేను, సురేఖ వెళ్తాం. సీఎం రేవంత్‌రెడ్డి నాకు ఎమ్మెల్సీ ఇస్తామన్నారు.. ఇస్తారు. ఆయన సీఎం కావాలని కోరుకున్న వారిలో నేనూ ఒకడిని. సీఎం, మంత్రి పొంగులేటి మా ఇంటికి వచ్చారు.. నన్నెందుకు టార్గెట్ చేస్తారని కొండా మురళి వ్యాఖ్యానించారు.

# రోగులకు భరోసా కల్పించండి: ఎమ్మెల్యే

**చేవెళ్ల, అక్టోబర్ 16 (ప్రభాత జాగృతి):** రోగులతో ఆప్యాయంగా మాట్లాడి వైద్యం చేయాలని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి వైద్యులకు సూచించారు. చికిత్సకు వచ్చిన వారికి భరోసా కల్పించాలని అన్నారు. వారికి మనోధైర్యం ముఖ్యమని అన్నారు. గురువారం ఆయన తాండూరు జిల్లా ఆసుపత్రి, నర్సింగ్ విద్యార్థుల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డులన్నీ తిరిగి రోగులతో మాట్లాడారు. వైద్యులు సమయపాలన పాటించాలని కోరారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఎదుర్కొంటున్న నీటి సమస్య, డ్రైనేజీ వ్యవస్థ బాగాలేదని వైద్య సిబ్బంది ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆసుపత్రిలో ఉన్న సమస్యల పరిష్కారానికి పక్షం రోజుల్లోగా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. ఈ పర్యవేక్షణలో వినయ్ కుమార్, ఆర్ఎంవో ఆనంద్ గోపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# అన్నదమ్ముల వివాదం.. తమ్ముడి దాడితో వదిన మృతి

**వరంగల్, (నేటి ఫోకస్‌న్యూస్)-అక్టోబర్ 16:**ఐజిల్లాలో దారుణం చోటుచేసుకుంది. అన్నపై తమ్ముడు దాడి చేయగా.. అడ్డొచ్చిన వదిన తీవ్రగాయాలతో మృతిచెందారు. నల్లబెల్లి మండలం కొండాపురంలో ఈ ఘటన చోటు చేసుకుంది. అన్న మేరుగుర్తి రమేశ్‌పై తమ్ముడు సురేశ్ కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో వదిన స్వరూప (30) అడ్డు వచ్చింది. దీంతో ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. అంబులెన్స్‌లో నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో స్వరూప మృతిచెందారు. గాయాలతో ఆస్పత్రిలో రమేశ్ చికిత్స పొందుతున్నాడు. అన్నదమ్ముల మధ్య డబ్బు వివాదమే ఈ ఘటనకు కారణంగా పోలీసులు భావిస్తున్నారు.

# జూబ్లీహిల్స్ ఎన్నికలో మద్దతు ఇవ్వండి

- సిపిఎంను కోరిన పిసిసి చీఫ్

**హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-అక్టోబర్ 16:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌కుమార్ యాదవ్‌కు మద్దతివ్వాలని, బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలు కోసం జరుగుతున్న పోరాటంలో ప్రభుత్వంతో కలిసి రావాలని సీపీఐ(ఎం)ను టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ కోరారు. గురువారం హైదరాబాద్‌లోని సీపీఎం కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీతో ఆయన భేటీ అయ్యారు. పార్టీ నగర కమిటీతో చర్చలు జరుగుతున్నాయని, ఈ నెల 20న జరిగే తమ పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశాల్లో నిర్ణయాన్ని ప్రకటిస్తామని జాన్‌వెస్లీ తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని సూచించారు. దీనిపై మహేశ్‌కుమార్ గౌడ్ సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, టి.జ్యోతి, టి. సాగర్, మల్లు లక్ష్మి, అబ్బాస్, బండారు రవికుమార్, పలువురు రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

# స్కూలుకు కోటి విరాళం ఇచ్చిన మాజీ ఎమ్మెల్యే బిగాల

**నిజామాబాద్, అక్టోబర్ 16 (ప్రభాత జాగృతి):** నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా మాక్లూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ. కోటి విరాళం అందజేశారు. ఈ మేరకు గురువారం ఆయన తన సోదరుడు బిగాల మహేశ్‌తో కలిసి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయానికి వచ్చి కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డికి కోటి రూపాయల విలువ గల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి అశోక్ పాల్గొన్నారు.

# బీసీల బందును జయప్రదం చేయాలి



తొర్రూరు నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఓరుగంటి సైదులు అక్టోబర్ 16

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై హైకోర్టు స్టే ఇచ్చినందుకు నిరసనగా ఈనెల 18న నిర్వహించే బీసీ బంద్ ను జయప్రదం చేయాలని బీసీ సంఘాల జేఏసీ నాయకులు ముద్దసాని వెంకటేశ్వర్లు, సముద్రాల సోమయ్యలు కోరారు.

గురువారం తొర్రూర్ డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనంలో బీసీ సంఘాల జేఏసీ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే ప్రభుత్వం ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర జనాభాలో అరవై శాతం ఉన్న బీసీలకు ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వకుండా అత్యల్ప జనాభా ఉన్న వారు రాజ్యమేలుతున్నారని, దీనికి కారణం బీసీలలో ఐకమత్యం లేకపోవడమేనని వారు తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చి 8 దశాబ్దాలు కావొస్తున్నా బీసీలను రాజకీయంగా, సామాజికంగా ఎదగనివ్వకుండా రాజకీయ పార్టీలు బీసీలకు అన్యాయం చేస్తున్నాయని పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపును అడ్డుకోవడం సరికాదన్నారు. కోర్టు తీర్పులను అధిగమించడానికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. రిజర్వేషన్లు లో బీసీలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని లేనిపక్షంలో బీసీ సంఘాలన్నీ పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. రాజకీయ రిజర్వేషన్లపై బీసీ కులాలంతా ఏకమై పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో బిసి జేఏసీ నాయకులు చీకటి రమేష్ గౌడ్, బి. అల్లా బాబు, దొనికెన కుమారస్వామి, కొండా వెంకన్న, కొదునూరి సధాకర్, కోట వెంకటేశ్వర్లు, తాళ్లపల్లి బిక్షం గౌడ్, పైండ్ల రాజేష్, గట్టు కమలాకర్, పెండెం రమేష్, మిట్ట కోల లక్ష్మణ్, కస్తూరి పులేందర్, జలగం స్వామి గౌడ్, పంజాల శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## నిరుపేద కుటుంబానికి 50 కిలోల బియ్యం ఆయిల్ క్యాన్' అందజేత

### సహాయం అండగా ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్' చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి

నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి:మచ్చ శ్రావణ్ రాయపర్తిఅక్టోబర్ 17

మండలాల్లోని మైలారం గ్రామంలో గబ్బేట సోము మల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించగా, ఈ రోజు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 కేజీ ల బియ్యం, ఆయిల్ క్యాన్ అందించారు ఈ కార్యక్రమం లో రాయపర్తి మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్ గ్రామ పార్టీ అధ్యక్షులు ఎలమంచ శ్రీనివాస్ రెడ్డి మండల పార్టీ ముఖ్య నాయకులు లేతకుల రంగా రెడ్డి, పార్టీ ముఖ్య నాయకులు గబ్బేట కొమురయ్య, గబ్బేట యాకయ్య, సంకినేని ఎల్లస్వామి, కోలా సంపత్, గాడిపెల్లి రాములు, చిర్ర బిక్షపతి, చిర్ర దర్గయ్య, గబ్బేట యాకయ్య, గాడిపెల్లి రాజు, జిల్లా సారయ్య,ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.



## కూచిపూడి పోటీలలో లిటిల్ ఫ్లవర్ విద్యార్థినికి ప్రథమ స్థానం

తొర్రూరు నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఓరుగంటి సైదులు అక్టోబర్ 16

జాతీయస్థాయి కూచిపూడి పోటీలలో లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న బానోత్ నివేదిత ప్రథమ స్థానం సాధించిందని పాఠశాల కరస్పాండెంట్ అనుమాండ్ల దేవేందర్ రెడ్డి అన్నారు. గురువారం పాఠశాలలో ప్రిన్సిపల్ నాగేశ్వరరావుతో కలిసి విద్యార్థినికి శాలువులతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాన్సన్ పబ్లికేషన్ ఆధ్వర్యంలో ఈనెల 12న రవీంద్ర భారతిలో నిర్వహించిన పోటీలలో తమ పాఠశాల విద్యార్థిని నివేదిత బహుమతి సాధించిందన్నారు. ఈ బహుమతిని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. నివేదితను ప్రోత్సహించి జాతీయ,రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవలు అభినందనీయం

### ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



తొర్రూరు నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఓరుగంటి సైదులు అక్టోబర్ 16

ప్రత్యేక శిబిరంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు చేసిన సేవలు అభినందనీయమని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. తొర్రూరు మున్సిపాలిటీ పరిధిలోని దుబ్బ తండాలో మహబూబాబాద్ తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మునుకుంట్ల యాదలక్ష్మీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 6వ రోజు ప్రత్యేక శిబిరాన్ని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్–ఎస్ జిల్లా కన్వీనర్ మర్సకట్ల అనిల్ కుమార్ తో కలిసి ఆమె మాట్లాడుతూ దుబ్బ తండాలో ఏడు రోజుల ప్రత్యేక శిబిరంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు చేపట్టిన సేవా కార్యక్రమాలు అభినందనీయమని, విద్యార్థి దశ నుంచే సేవా దృక్పథాన్ని కలిగి ఉండడం వల్ల నిస్వార్థ సేవకులుగా మారతారని అన్నారు. అవసరంలో ఉన్నవారికి సేవ చేయడంలో ఉన్న తృప్తి మరే రంగంలో దొరకదని, సమాజం మనకేమిచ్చిందని కాకుండా సమాజానికి మనం ఎంత సేవ చేసాం అనేది గొప్ప విషయమని అన్నారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సేవారంగంలో రాణించాలని సూచించారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకొని, సమగ్ర మూర్తిమత్వ వికాసం చెందుతారని తెలిపారు. అనంతరం వాలంటీర్ల చేత సామాజిక రుగ్మతులపై నాటికలు, పాటలు, నృత్యాల ద్వారా ప్రజలలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఝాన్సీ, త్రిష, నవ్య, సాగరిక, స్రవంతి, స్పందన, దివ్య, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి



పెద్దవంగర నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఓరుగంటి సైదులు అక్టోబర్ 16

ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని లయన్స్ క్లబ్ తొర్రూరు సేవా తరుణి అధ్యక్షురాలు లయన్ తుమ్మూరు శ్రీదేవి రెడ్డి అన్నారు.

సేవాతరుణి అధ్యక్షురాలు శ్రీదేవి రెడ్డి మండలంలోని చిట్యాల జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ఎన్ఎం ఎంఎస్,10వ తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాలు, పరీక్ష ప్యాడ్లను అందజేశారు. ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమార్ కోరిక మేరకు రూ. 10 వేలు విలువచేసే కార్డు లెస్ మౌత్ ని త్వరలో ఇస్తామని హామీ ఇచ్చారు. వడ్డే కొత్తపల్లి జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాలలు, విద్యార్థులు కూర్చోవడానికి నాలుగు పెద్ద ప్లాస్టిక్ మ్యాట్స్, చాక్లెట్స్, ఐదుగురు పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎంలు విజయ్ కుమార్, శేషవలి, రవీందర్ రెడ్డి, క్లబ్ సెక్రటరీ లయన్ కూన పద్మావతి, లయన్ ఉమా రెడ్డి, ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

పెద్దవంగర నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఓరుగంటి సైదులు అక్టోబర్ 16

ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని లయన్స్ క్లబ్ తొర్రూరు సేవా తరుణి అధ్యక్షురాలు లయన్ తుమ్మూరు శ్రీదేవి రెడ్డి అన్నారు. సేవాతరుణి అధ్యక్షురాలు శ్రీదేవి రెడ్డి మండలంలోని చిట్యాల జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ఎన్ఎం ఎంఎస్,10వ తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాలు, పరీక్ష ప్యాడ్లను అందజేశారు.

ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమార్ కోరిక మేరకు రూ. 10 వేలు విలువచేసే కార్డు లెస్ మౌత్ ని త్వరలో ఇస్తామని హామీ ఇచ్చారు. వడ్డే కొత్తపల్లి జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాలలు, విద్యార్థులు కూర్చోవడానికి నాలుగు పెద్ద ప్లాస్టిక్ మ్యాట్స్, చాక్లెట్స్, ఐదుగురు పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎంలు విజయ్ కుమార్, శేషవలి, రవీందర్ రెడ్డి, క్లబ్ సెక్రటరీ లయన్ కూన పద్మావతి, లయన్ ఉమా రెడ్డి, ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## 18న బీసీ సంఘాల బంద్‌కు మద్దతు ప్రకటించిన మహేశ్ కుమార్ గౌడ్

**బీసీ రిజర్వేషన్ల అంశంపై తాము వెనక్కి తగ్గేది లేదన్న టీపీసీసీ చీఫ్**

**కొండా సురేఖను పిలిచి మాట్లాడుతామన్న మహేశ్ కుమార్ గౌడ్**

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్

అక్టోబర్ 18న బీసీ సంఘాలు తలపెట్టిన తెలంగాణ రాష్ట్ర బంద్‌కు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో తమ పార్టీ వెనక్కి తగ్గేది లేదని ఆయన స్పష్టం చేశారు. బంద్ నేపథ్యంలో బీసీ సంఘాల నేతలతో ఆయన గాంధీ భవన్‌లో సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, దేశంలో కుల సర్వేలకు ఆద్యుడు రాహుల్ గాంధీ అని కొనియాడారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన కామారెడ్డి డిక్లరేషన్‌కు తాము కట్టుబడి ఉన్నామని ఆయన పునరుద్ఘాటించారు. బీసీ రిజర్వేషన్లపై ఎట్టి పరిస్థితుల్లోనూ వెనకడుగు వేసే ప్రసక్తి లేదని తేల్చి చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి బీసీ ఈ బంద్‌కు మద్దతు ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ బంద్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలగాలని ఆయన ఆకాంక్షించారు.

అసెంబ్లీలో బీసీ బిల్లుకు మద్దతు తెలిపిన బీజేపీ, బయట మాత్రం అడ్డుకుంటోందని ఆయన ఆరోపించారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో న్యాయ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కై రిజర్వేషన్లను అడ్డుకుంటున్నాయని ఆయన విమర్శించారు. రాహుల్ గాంధీ ఆశయ సాధన కోసం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని ఆయన ప్రశంసించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించిన తర్వాత ఎన్నికలకు వెళ్లాలనే ఆలోచనలో ఉన్నామని ఆయన స్పష్టం చేశారు.మంత్రి కొండా సురేఖ వ్యవహారంపై మహేశ్ కుమార్ గౌడ్ స్పందిస్తూ, ఆమెతో స్వయంగా మాట్లాడతానని తెలిపారు. త్వరలోనే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎక్కడో కమ్యూనికేషన్ గ్యాప్ ఉన్నట్లు కనిపిస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు.

## కుల గణనకు నారాయణ మూర్తి దంపతుల 'నో'..

**బెంగళూరులో నత్తనడకన సాగుతున్న సర్వే ప్రక్రియ**

కర్ణాటక ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సామాజిక-ఆర్థిక సర్వేలో పాల్గొనేందుకు ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు నారాయణ మూర్తి, ఆయన భార్య, రచయిత్రి సుధా మూర్తి నిరాకరించారు. తాము ఏ వెనుకబడిన వర్గానికి చెందని వారం కాబట్టి, ఈ సర్వే వల్ల ప్రభుత్వానికి తమ నుంచి ఎలాంటి ప్రయోజనం ఉండదని వారు స్పష్టం చేశారు. సర్వే కోసం తమ నివాసానికి వచ్చిన అధికారులకు ఈ విషయాన్ని లిఖితపూర్వకంగా రాసిచ్చారు. సర్వే ఫారమ్‌పైనే తమ అభిప్రాయాన్ని వారు తెలియజేయడం గమనార్హం.

# ఆరోగ్యవంతమైన తరానికి పునాది పౌష్టికాహారం

**మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి సబిత**

తొర్రూరు నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఒరుగంటి సైదులు అక్టోబర్ 16



పౌష్టికాహారమే సంపూర్ణ ఆరోగ్యానికి పునాది అని మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి సబిత అన్నారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో జరుగుతున్న పోషణ మాసోత్సవంలో భాగంగా గురువారం మండలంలోని వెలికట్ట గ్రామపంచాయతీ ఆవంణలో చిన్నారులకు అన్నప్రాశన, అక్షరాభ్యాసం, గర్భిణులకు శ్రీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోషకాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు.

డీడబ్ల్యూవో సబిత మాట్లాడుతూ, తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను ప్రతి కుటుంబం ఆహారపు అలవాట్లలో చేర్చుకోవాలని సూచించారు. రాగి జావ, పల్లి పట్టి, నువ్వుల లడ్డు, జొన్న లడ్డు, చిరుధాన్యాలతో తయారు చేసిన లడ్డు, బెల్లం పరమాన్నం, పుట్నాలు, వేరుశనగ పొడి, మునగాకు కారం పొడి వంటి పదార్థాలు శరీరానికి కావాల్సిన పౌష్టిక విలువలను అందిస్తాయని వివరించారు. ఆకుకూరలు, పండ్లు, చిరుధాన్యాలు నిరంతరం తీసుకోవడం ద్వారా శరీర ధృడత్వం పెరుగుతుందని ఆమె తెలిపారు.

గర్భిణులు సరైన పోషకాలు తీసుకోకపోవడం వల్ల రక్తహీనత, బలహీనత వంటి సమస్యలు తలెత్తుతున్నాయని, దాంతో పుట్టబోయే శిశువులు అనారోగ్యంతో బాధపడే అవకాశం ఉంటుందని తెలిపారు. పాలిచ్చే తల్లులు పోషకాహారం తీసుకోకపోవడం చిన్నారుల్లో పౌష్టికాహార లోపానికి దారితీస్తుందని ఆమె పేర్కొన్నారు. ఈ సమస్యలను అధిగమించేందుకు ప్రభుత్వం పోషణ మాసం కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నదని డీడబ్ల్యూవో సబిత వివరించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీఓ వై. పూర్ణచందర్, సిడిపిఓ కె. కమలాదేవి, ఏసిడిపిఓలు జి. విజయలక్ష్మి, బి. సంకీర్తన, వెలికట్ట పల్లె దవాఖాన వైద్యురాలు డాక్టర్ ఫాతిమా ఫరా, సూపర్వైజర్లు మల్లీశ్వరి, శ్రీదేవి, గౌసియా, సునీత, శోభ, నాగమణి, బిసి నడిగడ్డ అశోక్, ఏఎన్ఎం జ్యోతి, అంగన్వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## చంద్రబాబుపై దాడి సూత్రధారి.. మావోయిస్టు

# అగ్రనేత ఆశన్న లొంగుబాటు!

**అభయ్ లొంగిపోయిన మరుసటి రోజే ఈ కీలక పరిణామం**

**ఛత్తీస్‌గఢ్‌లో ఒకేరోజు 78 మంది మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి**

**చంద్రబాబు, మాధవరెడ్డిలపై దాడుల్లో ఆశన్న కీలక పాత్ర**

**ప్రభుత్వ చర్యలతోనే మావోయిస్టుల్లో మార్పు వస్తోందన్న అమిత్ షా**

మావోయిస్టు ఉద్యమానికి పెను విఘాతం తగిలింది. పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, అగ్రనేత తక్కళ్ళపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు అధికారిక వర్గాలు ప్రకటించాయి. మరో కీలక నేత మల్లోజుల వేణుగోపాల్ రావు (అభయ్) లొంగిపోయిన 24 గంటల్లోపే ఈ పరిణామం చోటుచేసుకోవడం సంచలనం సృష్టిస్తోంది. ఈ వరుస లొంగుబాట్లు మావోయిస్టు పార్టీకి తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

బుధవారం మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఎదుట అభయ్ లొంగిపోగా, అదే రోజు ఛత్తీస్‌గఢ్‌లోని వేర్వేరు ప్రాంతాల్లో ఏకంగా 78 మంది మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిశారు. సుక్మా జిల్లాలో 27 మంది, కాంకేర్ జిల్లాలో 50 మంది అజ్ఞాతం వీడారు. వీరిలో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీకి చెందిన కీలక నేతలు రాజమన్ మండావి, రాజు సలామ్ కూడా ఉన్నారు. కాంకేర్‌లో లొంగిపోయిన వారు ఏకే 47 రైఫిల్స్‌తో సహా 17 ఆయుధాలను పోలీసులకు అప్పగించారు.

ఆశన్న లొంగుబాటుకు ముందు నుంచే శాంతి చర్చల వైపు మొగ్గు చూపుతున్నట్లు సంకేతాలు ఇచ్చారు. నార్త్ వెస్ట్ సబ్ జోనల్ బ్యూరో ఇన్‌చార్జ్‌గా ఆయన పలు లేఖలు విడుదల చేశారు. ఒక యూట్యూబర్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కూడా "తుపాకీ కన్నా చర్చల ద్వారానే సమస్యలకు పరిష్కారం లభిస్తుంది" అని ఆయన స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే ఆయన అభయ్ బాటలో నడిచినట్లు తెలుస్తోంది.

**తెలుగు రాష్ట్రాల్లో కీలక దాడుల సూత్రధారి**

తెలంగాణలోని ములుగు జిల్లా వెంకటాపురం మండలం లక్ష్మీదేవిపేటకు చెందిన ఆశన్న, 1989లో అజ్ఞాతంలోకి వెళ్లారు. తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన అనేక కీలక దాడుల్లో ఆయనకు ప్రమేయం ఉంది. 1999లో హైదరాబాద్‌లో ఐపీఎస్ అధికారి ఉమేశ్ చంద్ర హత్య, 2000లో ఘట్‌కేసర్ వద్ద మాజీ హోంమంత్రి ఎలిమినేటి మాధవరెడ్డి హత్య కేసుల్లో ఆయన నిందితుడు. 2003లో తిరుపతి అలిపిరి వద్ద అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబుపై జరిగిన క్లెమోర్ మైన్స్ దాడికి నాయకత్వం వహించింది కూడా ఆశన్న బృందమే.

**నక్సలిజానికి భారీ ఎదురుదెబ్బ.. రెండు రోజుల్లో 258 మంది లొంగుబాటు**

దేశంలో నక్సలిజానికి వ్యతిరేకంగా సాగుతున్న పోరాటంలో కేంద్ర ప్రభుత్వానికి భారీ విజయం లభించింది. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర రాష్ట్రాల్లో కేవలం రెండు రోజుల వ్యవధిలో 258 మంది నక్సలైట్లు లొంగిపోయారు. ఈ కీలక పరిణామంపై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా గురువారం తన అధికారిక 'ఎక్స్' ఖాతా ద్వారా ప్రకటన చేశారు. హింసా మార్గాన్ని వీడి, భారత రాజ్యాంగంపై విశ్వాసం ప్రకటిస్తూ ఇంత పెద్ద సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోవడం గమనార్హం.

ఈ లొంగుబాట్ల వివరాలను అమిత్ షా స్వయంగా వెల్లడించారు. "ఛత్తీస్‌గఢ్‌లో బుధవారం 27 మంది, గురువారం 170 మంది ఆయుధాలు వీడారు. అదేవిధంగా, మహారాష్ట్రలో బుధవారం 61 మంది లొంగిపోయారు. దీంతో మొత్తం 258 మంది జనజీవన స్రవంతిలో కలిశారు" అని ఆయన తెలిపారు. ఈ పరిణామం నక్సలిజంపై పోరాటంలో ఒక ప్రధాన విజయమని ఆయన అభివర్ణించారు. హింసను విడనాడిన వారికి ఆయన అభినందనలు తెలిపారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నిరంతర చర్యల వల్లే నక్సలిజం ఇప్పుడు చివరి శ్వాస తీసుకుంటోందని అమిత్ షా వ్యాఖ్యానించారు. నక్సలైట్ల విషయంలో తమ ప్రభుత్వ విధానం చాలా స్పష్టంగా ఉందని ఆయన పునరుద్ఘాటించారు. "లొంగిపోవాలనుకునే వారికి ఎల్లప్పుడూ స్వాగతం ఉంటుంది. కానీ ఆయుధాలు పట్టుకుని తిరిగేవారిపై మా భద్రతా బలగాలు కఠిన చర్యలు తీసుకుంటాయి" అని హెచ్చరించారు. ఇంకా మిగిలి ఉన్న నక్సలైట్లు కూడా హింసను వీడి శాంతియుత మార్గాన్ని ఎంచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.